క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గద్వాల అర్బన్: రిపబ్లిక్ డే సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు 'రాజ్యాంగ విలువల పరిస్థితి– ప్రజల కర్తవ్యం', 'భారతదేశంలో మతాల మధ్య సామరస్యత సమానత' అనే అంశాలపై వ్యాసరచన, వన్ మినిట్ వీడియో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి మొదటి సంవత్సరం బీఏ హెచ్‌ఈపీ విద్యార్థి తహసీయత్‌కు, ద్వితీయ బహుమతి రెండో సంవత్సరం విద్యార్థి హెచ్‌ఈపీ నజీయ, తృతీయ బహుమతి రెండో సంవత్సరం బీజెడ్‌సీ సింధూజ గెలుపొందారు. వన్‌మినిట్ వీడియో విభాగంలో మొదటి బహుమతి రేఖ ప్రతిభ కనబర్చారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అభినందించారు. గెలుపొందిన విద్యార్థుల వివరాలను పౌర సమాజ వేదిక జనగణమన అభియాన్‌కు పంపినట్లు తెలిపారు.

రైతుబీమా చెక్కు పంపిణీ



గట్టు: మండలంలోని బల్గెరకు చెందిన ముగ్గురు కుటుంబ సభ్యులకు గురువారం జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హనుమంతునాయుడులు రైతుబీమా చెక్కులను అందజేశారు. బల్గెరకు చెందిన దళిత రాజప్ప, రాజేశ్వరి, చిన్న తిమ్మప్పలు మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రైతుబీమా రూ.5 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. బాధితులు నర్సమ్మ, గోవిందు, మారెమ్మలకు చెక్కులను అందజేశారు.

మాన్‌దొడ్డిలో వికసిత భారత్ సంకల్ప్ యాత్ర



రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డిలో గురువారం వికసిత భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా శాఖల అధికారులు మాట్లాడుతూ ప్రజలకు అందిన సంక్షేమ పథకాలపై, వాటిని ప్రవేశపెట్టడంతో ముఖ్య ఉద్దేశ్యమేమిటనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో నగదు, నగలు చోరీ

గద్వాల క్రైం: రెండు ఇళ్లలో చోరీ జరిగిన సంఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. పాత హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన భారతి రెండు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లింది. గుర్తు తెలియని దుండగులు తాళం ధ్వంసం చేసి ఇంట్లో ఉన్న రెండు తులాల బంగారం, 20 తులాల వెండి తీసుకెళ్లారు. అదే కాలనీకి చెందిన గణేష్‌బాబు గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి బీచుపల్లి దేవాలయానికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారం, రూ.26 వేల నగదును అపహరించారు. ఇరువురు బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వర్షపాత నమోదు కేంద్రాలు శిథిలం



అయిజ: మండల కేంద్రంలో, మండలంలోని చిన్నతాండ్రపాడు, తొత్తినోనిదొడ్డి, వెంకటాపురం, సిందనూరు, ఉప్పలక్యాంప్ గ్రామాల్లో ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసిన వర్షపాత నమోదు కేంద్రాలు శిథిలావస్థకు చేరాయి. వర్షపాత నమోదు పరికరాలు పనిచేయకపోవడంతో ఆ ప్రాంతాల్లో కురిసిన వర్షపాతం నమోదు చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. అతివృష్టి లేదా అనావృష్టి ఏర్పడిన సందర్భంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం పంటనష్ట పరిహారం అందజేస్తుంది. పంటనష్టాన్ని నిర్ధయించే కొన్ని అంశాలలో వర్షపాతం నమోదు కూడా ఒకటి. దీంతో పనిచేయని వర్షపాత నమోదు కేంద్రాల నుంచి సరైన సమాచారం అందడంలేదు. ప్రతి నెలలో ప్రతిరోజు కురిసిన వర్షపాతాన్ని లెక్కగట్టి సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం పంపించాల్సి ఉంటుంది. వర్షపాత నమోదు కేంద్రాలు నిర్వీర్యం కావడంతో మండలంలో కురిసిన వర్షపాతం నమోదు కావడంలేదు. కొన్ని పంటలకు నష్టపరిహారం చెల్లించేందుకు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుంటారు. ఉన్నతాధికారులు స్పందించి వచ్చే వర్షాకాలం నాటికైనా ప్రతి గ్రామంలో వర్షపాత నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అలంపూర్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ అశోక్ కుమార్



కేటీదొడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఘనంగా ఓటరు దినోత్సవం

గద్వాల క్రైం: 18 ఏళ్లు నిండిన వారందరు ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందిగా ఏఎస్పీ రవి అన్నారు. గురువారం జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఓటు హక్కు అంశంపై మాట్లాడారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా, కులం, మతం, వర్గ, భాష తదితర అంశాలకు తావు ఇవ్వకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. అనంతరం సిబ్బందితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఐలు, సిబ్బంది ఉన్నారు.

ఓటే వజ్రాయుధం

గద్వాల అర్బన్: ఓటు వజ్రాయుధం లాంటిదని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. 18ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటుహక్కు నమోదు చేసుకోవాలన్నారు. సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు, అధ్యాపకులు కృష్ణమూర్తి, నాగభూషణం, నర్సింహులు, మనోజ్ ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధం..

అలంపూర్: ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధమని తహసీల్దార్ మంజుల, మండల విద్యాధికారి అశోక్ కుమార్ అన్నారు. పట్టణంలో ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, బీఎల్ఓలు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ర్యాలీ అనంతరం గాంధీచౌక్‌లో ఎంఈఓ అశోక్ కుమార్ అందరితో ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు తహసీల్దార్ వెంకట్రావ్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. పాఠశాల నుంచి వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ప్రతిజ్ఞ నిర్వహించారు.



మానవపాడులో ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

విద్యార్థుల మాక్ పోలింగ్

గట్టు: ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఆలగిద్ద ఉన్నత పాఠశాలలో గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు ఓటర్లుగా మారి పోలింగ్ కేంద్రం ముందు బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. హెడ్మాస్టర్ జహీర్‌బేగ్ ఆధ్వర్యంలో మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. ఓటును వినియోగించుకున్న తర్వాత బ్యాలెట్ పేపర్‌ను బ్యాలెట్ బాక్స్‌లో వేశారు. పోటీలో 5 మంది విద్యార్థులు సర్పంచ పదవికి పోటీ పడ్డారు. అంజనేయులుకు 62 ఓట్లు, నవ్వీన్‌కు 36 ఓట్లు, రామేశ్వరికు 28 ఓట్లు, రవికు 20 ఓట్లు, రంజితకు 18 ఓట్లు వచ్చాయి. 239 మంది విద్యార్థులకు గాను 164 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు హెడ్మాస్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరామ విక్రమ సింహాచారి, నాగమణి, శివశంకర్, ఉమేశ్వరయ్య పాల్గొన్నారు.



ఓటు వేసేందుకు బారులు తీరిన విద్యార్థులు

కేటీదొడ్డి: ప్రజాస్వామ్యంలో ప్రజలకు కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటేనే ప్రజాస్వామ్యాన్ని కాపాడినట్లు అవుతుందని తహసీల్దార్ సరితారాణి, ఎస్‌ఐ వెంకటేష్ అన్నారు. గ్రామాలలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహ్మద్ అజార్ మొహిద్దీన్, డీటీ శివశంకర్, ఎంపీఓ సయ్యద్‌ఖాన్, ఆర్‌ఐ ఉదయ్‌కిరణ్, వెంకటేష్ నాయుడు, భీమయ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ అన్నారు. కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆర్టికల్ 326 ప్రకారం ఓటుహక్కును కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

మానవపాడు: జాతీయ ఓటరు దినోత్సవాన్ని మండల కేంద్రంలో తహసీల్దార్ జుబెర్ మొహినొద్దీన్ ఘనంగా నిర్వహించారు. ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఓటరు దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణారావు, ఎస్‌ఐ రాము పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలో ఓటరు దినోత్సవం అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఓటరు దినోత్సవం అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ, బస్టాండ్ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్‌లింగం, డీటీ సురేష్, నర్సన్న, సూర్యప్రకాష్‌రెడ్డి, ఆర్‌ఐలు రామకృష్ణ, నాగిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు



మల్దకల్‌లో..

క్రీడలతో మానసిక ఉల్లాసం

మానవపాడు: మండలంలోని బోరవెల్లిలో శ్రీ చెన్నకేశవస్వామి జాతర సందర్భంగా గురువారం కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే విజేయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడలు మానసిక, శరీరక ఉల్లాసాన్ని అందిస్తాయని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ఆడాలని, ఆటలో గెలుపోటములు సహజమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కాంతారెడ్డి, సత్యారెడ్డి, మద్దిలేటి, రియాజ్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ నూతన భవనాలు ప్రారంభం..

అలంపూర్ రూరల్: మండలంలోని ర్యాలంపాడ్, జిల్లెలపాడ్ గ్రామాల్లో గురువారం నూతన గ్రామ పంచాయతీ భవనాలను ఎమ్మెల్యే విజేయుడు ప్రారంభించారు. జిల్లెలపాడ్‌లోని గ్రామ పంచాయతీ భవనం శిలాఫలకంపై ప్రోటోకాల్ ప్రకారం ఉపసర్పంచ్ పేరులేదని ఉప సర్పంచ్ లాలునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుబ్రా సర్దార్, నాయకులు పాల్గొన్నారు.



బోరవెల్లిలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించండి



అయిజ: పట్టణంలో పాతబస్టాండ్, కొత్త బస్టాండ్ మధ్య పెద్దవాగుపై నిర్మిస్తున్న హై లెవల్ వంతెన పనుల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేసినా అది ఊరుబయట చాలా దూరంలో ఉండడంతో ప్రజలు విముఖత చూపుతున్నారు. పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ చౌక్ నుంచి పశువుల ఆస్పత్రి ముందు కొత్త బస్టాండ్ వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రతిరోజు ట్రాఫిక్ జామ్ అవుతోంది. దానివల్ల అత్యవసర పనులపై వెళ్లేవారు, ఆస్పత్రులకు వెళ్లేవారు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనాలు, చిన్న ఆటోలను మాత్రమే ఆరోడ్డులో అనుమతించాలని, పెద్ద వాహనాలను ఊరి బయట ప్రత్యామ్నాయ రోడ్డుపై వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న టోల్ సిబ్బంది



ఎర్రవల్లి కూడలిలో గులాబీ పువ్వు అందిస్తున్న ఎస్‌ఐ అశోక్‌బాబు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా సిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వాహనాలకు రోడ్డు ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్లను అతికించి, వాహనదారులకు పలు సూచనలు సలహాలు అందించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, మద్యం తాగి నడపరాదని, అతివేగంగా వెళ్ల కూడదన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ బాల గణేష్, సేఫ్టీ ఆఫీసర్ ఆదిత్య, మేనేజర్ సురేష్, మణి, దుర్గ మోహన్, వెంకటేష్, శేషన్న పాల్గొన్నారు.


ఎర్రవల్లిచౌరస్తా: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని ఇటిక్యాల ఎస్‌ఐ అశోక్‌బాబు అన్నారు. ఎర్రవల్లి మండల కేంద్రంలోని కూడలిలో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించిన ప్రయాణికులను అభినందించి గులాబీ పువ్వు అందజేశారు. కార్లలో సీట్ బెల్ట్, బైక్‌పై ప్రయాణించే వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతినగర్: వాహనాలు నడిపే వారు రోడ్డు భద్రతా నియమాలను పాటించకుంటే ప్రమాదాల బారిన పడి కుటుంబం రోడ్డున పడుతుందని ఎస్‌ఐ నరేష్ అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలోని శాంతి నగర్ సమీపంలోని అలంపూర్-రాయచూర్ ప్రధాన రహదారిపై వాహనాలు నిలిపి ప్రయాణికులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ వాహనాలు నడుపుతున్న వారికి పువ్వులు అందజేశారు.

ధరూరు: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్‌ఐ శివానందంగౌడ్ అన్నారు. గురువారం సాంయంత్రం మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలు వివరించారు. ఈ సందర్భంగా వాహనదారులకు పువ్వులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకట్రాములు, పోలీసులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివమాలాధారణ

ఎర్రవల్లిచౌరస్తా: మండల కేంద్రంలోని బీచుపల్లి శివాలయంలో గురువారం శివమాలాధారణ కార్యక్రమాన్ని శివ భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివాలయం ప్రధాన అర్చకులు గురురాజాచారి దాదాపు 30 మంది భక్తులకు వేదమంత్రాలతో శివ మాల వేశారు. అనంతరం శివమాల ధరించిన భక్తులు భక్తిశ్రద్ధలతో శివాలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



శివాలయాన్ని దర్శించుకుంటున్న శివ భక్తులు

అవినీతి చేసినట్లు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

గద్వాల రూరల్: ఈద్గా నిర్మాణంలో అవినీతి జరిగిందని నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని బీఆర్‌ఎస్ నాయకులు పీఏసీఎస్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్ జడ్పీచైర్‌పర్సన్ సరితకు సవాల్ విసిరారు. గురువారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీలను కేవలం ఓట్ల యంత్రాలుగానే ఉపయోగించుకుందని ఆరోపించారు. ఈద్గా నిర్మాణం గద్వాల ముస్లింల దశాబ్దాల కల అని, అలాంటి కలను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సాకారం చేస్తుంటే జీర్ణించుకోలేని కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈద్గా నిర్మాణం పనులకు మీరు ఒక్కరూపాయి కూడా నిధులు ఇవ్వలేదని, అలాంటిది కొత్తగా ఈద్గా నిర్మాణం పనుల్లో అవినీతి జరిగిందని ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. మజీద్, ఈద్గా కమిటీ సభ్యులు ఖలీల్, మన్సూర్, రిజ్వాన్, మొబిన్, మహబూబ్, అన్వర్ పాల్గొన్నారు.

రాయచూర్ రోడ్డుపై ప్రమాదకర కల్వర్టులు

ధరూరు: అంతర్రాష్ట్ర రహదారి గద్వాల–రాయచూర్ రోడ్డు వెంట కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయి. ధరూరు నుంచి జాంపల్లి వెళ్లే దారిలో ఈదమ్మ మిట్ట (ఎర్రమట్టి గుంతల) వద్ద ఉన్న కల్వర్టు కూలిపోయి ఏళ్లు గడిచినా పట్టించుకునే వారు కరువయ్యారు. అక్కడే ముళ్ల పొదలు పెరగడంతో కల్వర్టు సైతం కనిపించడం లేదు. వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా గోతిలో పడడం ఖాయంగా కనిపిస్తోంది. జాంపల్లి –కోతులగిద్ద స్టేజీల మధ్య ఉన్న కల్వర్టులు సైతం ఇటీవల ఓ మట్టి టిప్పర్ తగిలి కూలిపోయింది. అక్కడ కూడా ప్రమాదం పొంచి ఉంది. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు వాటిపై దృష్టి సారించి మరమ్మతులు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

సంస్కృతిక సంప్రదాయాలు గౌరవించాలి

కేటీదొడ్డి: తెలంగాణ రాష్ట్రంలోని సంస్కృతిక సంప్రదాయాలను గౌరవిస్తూ గ్రామాల్లో దేవతలను ప్రజలు పూజించడంతో పండుగ వాతావరణం నెలకొంటుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎర్సందొడ్డి, మాస్‌దొడ్డి గ్రామాలలో మారెమ్మ అవ్వ జాతర సందర్భంగా ఆయన పాల్గొన్ని ఆలయంలోని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో ప్రజలు జాతర ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సోదరభావంతో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్ఎంపీపీ రామకృష్ణనాయుడు, సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, సర్పంచు గోపాల్, తిక్కన్న, ఉరుకుందు, గోపి, రఘువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుబీమా చెక్కు పంపిణీ..

గద్వాల రూరల్: గట్టు మండలం తుమ్మలపల్లికి చెందిన రైతు పార్వతమ్మ కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ క్రమంలో రైతుబీమా పథకం కింద బాధిత కుటుంబానికి రూ.5లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్, మహేశ్వర్‌రెడ్డి, ఆలూరు రామయ్య, విజయ్, రామకృష్ణగౌడ్ పాల్గొన్నారు.



రైతు బీమా చెక్కును బాధితుడికి అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

రాజోళి: మండల కేంద్రంలోని లక్ష్మీ వైకుంఠ నారాయణ స్వామి ఆలయంలో గురువారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వ్రతంలో దంపతులు పట్టు బట్టలతో వ్రతంలో కూర్చున్నారు. ఆలయంలోని వైకుంఠ నారాయణ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి వారి ఆలయంలో ప్రత్యేక మంగళహారతి నిర్వహించారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక శ్రద్ధ

మానవపాడు: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, 30 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహించి బీపీ, షుగర్ ఉన్న వారికి మందులు పంపిణీ చేయాలని డాక్టర్ రిజ్వానా తాన్వీర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశలతో సమావేశం నిర్వహించారు. బీపీ, షుగర్ ఉన్న వారికి ప్రతి నెల తప్పనిసరిగా మందులు వాడాలని సూచించారు. ఫిబ్రవరి 9వ తేదీన జాతీయ నులిపురుగుల దినోత్సవం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో కాన్పులు అయ్యేవిధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ సత్యానారాయణ, పీహెచ్ఎన్ హెలెన్, చంద్రన్న, సంధ్యారాణి, తిరుమల్‌రావు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.



మానవపాడు సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రిజ్వానా తాన్వీర్

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేయాలి



జెడ్పీచైర్‌పర్సన్ సరితకు వినతిపత్రం అందజేస్తున్న ఎంవీ ఫౌండేషన్ సభ్యులు

గద్వాల అర్బన్: జిల్లాలో విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కృషి చేయాలని ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ సరితకు క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, బాల కార్మికులు అధికంగా ఉన్నారని, ప్రత్యేక విద్య ప్రమాణాలు రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కో ఆర్డినేటర్ హనిమిరెడ్డి, కిరణ్ ఉన్నారు.

ఘనంగా గోకర్‌సాబ్, మౌలాలి ఉర్సు

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె, ఎర్సందొడ్డి, కేటీదొడ్డి గ్రామాల్లో గురువారం ఘనంగా గోకర్‌సాబ్, మౌలాలి ఉర్సు ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులోని మసీద్ వద్ద భక్తులు దానంగాలు, పొట్టేళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచు గోపాల్ నేతృత్వంలో నిర్వహించిన ఉత్సవాలకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వచ్చారు. కార్యక్రమంలో హమ్మద్‌హుస్సేన్, నసీరొద్దీన్, మన్సూర్, ఐనూస్, అలీమ్, అక్రమ్ ఉన్నారు.



మసీదులో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

గణతంత్ర వేడుకలకు ముస్తాబు



మానవపాడులో మువ్వెన్నెల రంగుల కాగితాలు కాడుతున్న సిబ్బంది



ముస్తాబైన ధరూరు గ్రామ పంచాయతీ

మానవపాడు: గణతంత్ర వేడుకలకు గురువారం మండలంలోని ఆయా గ్రామాలలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు ముస్తాబయ్యాయి. పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ కార్యాలయాల్లో జెండా స్తూపాలకు మువ్వన్నెల కాగితాలు కట్టి అందంగా ముస్తాబు చేశారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిబ్బంది తోక పిట్టలను అతికించి ముస్తాబు చేశారు. పాఠశాలలో సరస్వతి విగ్రహం వద్ద విద్యార్థులు ముగ్గులు వేశారు. పాఠశాలలో క్రీడలు నిర్వహించారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు పూర్తి..

ధరూరు: గణతంత్ర దినోత్సవ వేడుకలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జెండా ఏర్పాట్లు పూర్తి చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ లైటింగ్‌తో మెరిసిపోతున్నాయి.

